

# నిప్పులు గప్పిన నిజాయితీ

ముకుందరావుగారి ఇంటికి మూడిళ్ల అవతల అదే బజార్లో. ఆరేళ్ళ వయస్సున్న రెండు నారికేళవృక్షాలతో ఉన్న చిన్న పోర్టికోతో ముచ్చట గొలిపే ఇల్లు మాది.

మా ఇంటి గురించి చెబుతూ ముకుందరావుగారి పేరు ఎత్తటానికి కారణాలు లేకపోలేదు. ఒకటి– ఆ ఇంటిని చవగ్గా కొనేందుకు సాయపడిన వ్యక్తి. ప్రోత్సహించినవ్యక్తి ఆయనే!

రెండు- శిథిలావస్థలో ఉండి రాతి గోడలు. తాటాకు కప్పుతో భయం గొలిపే ఆ ప్రేతగృహాన్ని ముచ్చట గొలిపే యింటిగా తీర్చిదిద్దేందుకు ప్లాను వగయిరాలువేసి, ఆ యింటి నిర్మాణంలో ఉన్న లోటుపాట్లు సవరింపజేసి, అది రీమోడల్ చేసిన యిల్లని గుర్తుపట్టలేని విధంగా మారిపోయేటందుకు తన ఇంజనీరింగ్ ప్రతిభని వెచ్చించిన వ్యక్తి ముకుందరావుగారు.

ఇంత శ్రేయోభిలాషి కాబట్టే ముకుందరావుగారంటే ఎనలేని గౌరవం నాకు. ముకుందరావుగారు రిటైర్డు పి.డబ్ల్యు.డి. ఇంజనీరు. ఉద్యోగకాలంలో నీతిగా, నిజాయితీగా బతికేడని చెప్పుకుంటారు అందువల్లనేమో ఆకాశాన్నంటే హార్మ్యములోగాక సాధారణ మయిన చిన్న మేడలో నివసిస్తున్నాడు. ఆయన నీతి, నిజాయితీలకి తార్కాణంగా ఆ మేడని చూపెడితే, లాజికల్‌గా అది ఒప్పుకాదని నేనే అంగీకరిస్తున్నాను. కాని నా అనుభవంలో అంతకంటే గట్టి నిదర్శనాలే ఉన్నాయి.

ముకుందరావుగారి ఇంటికీ మా ఇంటికీ మధ్యనగల మూడిళ్లలో ఉన్న వ్యక్తుల గురించి వివరించటం యీ కథకి ఎంతయినా అవసరం. వాళ్ళు వెంకట్రామయ్యగారు, భాస్కరమూర్తి గారు, కృష్ణారావుగారు అనబడే గౌరవనీయులు!

నేను వచ్చిన తొలిరోజునే వీరి ముగ్గురి పరిచయభాగ్యం, ముకుంద రావుగారి ద్వారానే కలిగింది. పరిచయం చేయటంమినహా ముకుందరావు గారు వాళ్ళ గురించి అట్టే ఏమీ చెప్ప లేదు కానీ - ముకుందరావుగారి గురించి వాళ్ళు ముగ్గురూ చాలా చెప్పారు! అవన్నీ నిజమని నమ్మితే మళ్ళీ ముకుందరావుగారి గుమ్మం తొక్కటానికి నేను ఎంతో ధైర్యస్థుణ్ణి కావాలి.

కానీ - ముకుందరావుగారి గుమ్మం తొక్కేను! ఎందుకంటే - నా ధైర్యం మీద నాకు బోలెడు ఆత్మవిశ్వాసం ఉంది.

విశేషం ఎక్కడంటే-నేను ముకుంద రావుగారి కుటుంబంగురించి ఈముగ్గురు గౌరవనీయులు చెప్పగా విన్న విచిత్ర మైన కథలు. అవి కల్లలుకాబట్టే కథ లన్నాను. (కథలన్నీ కల్లలు కాకపో వచ్చు!)

ముకుందరావుగారికి పెళ్ళి కెదిగి సంబంధం కుదరని కూతురొకమ్మాయి ఉంది. ఆ అమ్మాయి - అందానికి ఒక నమూనా, సంభాషణా చాతుర్యానికి ఒక ఉదాహరణ. మంచితనానికీ, అమాయకత్వానికీ మారుపేరు.

అంతమంచి అమ్మాయి పేరు సుగుణ.

సుగుణకి నిర్విరామంగా గంటలతరబడీ బాతాఖానీవేసి కాలాన్ని ఖూనీ

చేయాలంటే బోలెడు సరదా. తన సరదా తీర్చుకొనేందుకు యిరుగిళ్ళకీ పొరుగిళ్ళకీ నిర్భయంగా వెళ్ళి వస్తుండేది.

ఈ నిర్భయత్వం అనేకానేక నిందారోపణలకీ, మనోవ్యాకులానికీ దారి తీసింది. అంతటితో ఆమెను ఇంటి పట్టునే కాలక్షేపం చెయ్యవలసిందని ఆంక్ష విధించటం ముకుంద రావుగారికి తప్పనిసరి అయింది అసలే తల్లి లేని పిల్ల !

ముకుందరావుగారు ఆ విధంగా ఆజ్ఞాపించింది లోకానికి వెరచికాదు; సంఘానికి ఝడిసికాదు! మాటపడని మనస్తత్వం ఆయనది. ఆత్మగౌరవం ఆయన ఊపిరి. ఆత్మస్థయిర్యం ఆయన శక్తి. నియమాలకు అంకితమయిన జీవితం ఆయనది. అందుకొఅకే అనురాగానికీ, ఆప్యాయతకీ ప్రాధాన్యత నీయలేదు.

వయసుతో సమంగా మనసు పెరగని సుగుణకి ఆ ఆంక్ష భరింపరానిదైంది రెక్కలు విరచిన విహంగంలా, స్వేచ్ఛ కోల్పోయిన పంజర పక్షిలా, గాజు కుండీలో బ్రతికే చేపపిల్లలాగా-యిన్ని విధాలుగా ఆమె మనోవేదనకి లోనైంది.

ఆ ఆవేదన ఆమె మాటల్లో ప్రస్ఫుటంగా తెలియవచ్చేది. కానీ - తండ్రి ఆజ్ఞకి భిన్నంగా ఏనాడూ ప్రవర్తించి ఎరుగదు. ఎటొచ్చీ, నాకూ ముకుంద రావు గారికీ పరిచయం అయిన తరువాత ఆమెకి కాస్త ఉసులు చిక్కిందేమో ననిపించింది.

కారణం ఖచ్చితంగా చెప్పలేనుగానీ మొదటి పరిచయంలోనే నేనంటే సుగుణ కేదో విపరీతమయిన అభిమానం పుట్టుకొచ్చింది. ఎడారిలో ఒయాసిస్సుని చూసిన పాంథునిలా ఆమె మనస్సు ఉప్పొంగినదని గట్టిగా చెప్పగలను.

మానసిక శాస్త్రరీత్యా ఆలోచించి చూస్తే ఫీలింగ్స్‌లో అనౌచిత్యం లేదనిపించింది. దుర్భరమయిన నిర్మానుష్య దీవిలో జీవించే ఒంటరిమనిషికి మరో మనిషి అగుపించినపుడు తొణికిసలాడే సంభ్రమం, మొహంలో సంతోష కాంతులు ఆమెలో ప్రతిఫలించేయి.

ఇన్ని మార్పులు ఆమెలో తావు చేసుకోవటానికి, ఆ మార్పులు చెదిరి పోకుండా నిలవటానికీ, నేనూ కొంత కారణమని చెప్పుకోవాల్సి ఉంది. చమత్కారాన్ని 'స్వభావంగా దాల్చే నా మాటలంటే చెవికోసుకునేది సుగుణ. ఎప్పుడూ చలాకీగా, చిరునవ్వులు వెదజల్లే పెదవులతో నిండుగా కనిపించే సుగుణ నా ప్రతిమూడు మాటలకీ ఒక మాటన్నా ఫక్కున నవ్వకుండా ఉండలేక పోయేది.

ఆ నవ్వే నా ఉత్సాహానికి ఊపిరి

పోసేది. ఆమెకి మరింత ఉల్లాసం కలిగించాలన్న ఆశంసతో అడుగు ముందుకు వేసేవాడ్ని.

ముకుందరావుగారు మా చనువు నేనాడూ తప్పు పట్టలేదు. ఒక్కనాడూ వారించలేదు. ఆయన ఉదాసీనతని నేనూ, సుగుణా వేర్వేరుగా అర్థం చేసుకున్నాం. (దురుద్దేశంతో మాత్రం కాదు.)

అప్పటికింకా నేను ముకుందరావు గారి అతిథినే. ఆకాశంనుండి ఊడిపడ్డ వాడ్ని కాదు. ఆయనగారి ఆప్తమిత్రుని అనుంగు బిడ్డని! తమ మిత్రుని మీదగల వాత్సల్యమే ముకుందరావుగారు నా మీద కురిపించిన అవ్యాజానురాగానికి అసలు కారణమని అర్థం చేసుకోవటానికి ఆట్టేకాలం పట్టలేదు. ఉద్యోగాన్వేషణలో వచ్చిన నాకు ఆశ్రయమివ్వటమేగాక తమ యింట్లోని ఒకవ్యక్తిగా ఆదరించటం నే నెన్నటికీ మర్చిపోలేని అనుభూతి.

అయితే మధ్య, మధ్య నాలో ఒక పిరికితనం తలెత్తుతుండేది. అంతటి అమృతహృదయునికి ద్రోహం ఎక్కడ చేస్తానో అని! ఈ భయానికి మూల కారణం సుగుణ!!

సుగుణ ఒట్టి అమాయకురాలుకాదు. ప్రమాదకరమయిన అమాయకురాలు. 'డేంజరస్ లీ యిన్నోసెంట్!' అ అమాయకత్వం ఎన్ని అపార్థాలకయినా దారి తీయగలదు. ఆశ్చర్యంలేదు. అందునా వయస్సులోఉన్న మొగవాడికి! బలహీన మానసికుడు తొందరపడి చేతులు కాల్చుకోవటానికి ఉర్దూలో తరచుగా విన్పించే పోలిక "పమ్మా - పర్వానా"కి ఆట్టే తేడాలేదు.

మనిషి ఆంతర్యం ఎంత గొప్ప దయినా ఆచరణదాకా ఆ గొప్పదనం నిలవదు!

ఎటొచ్చీ నన్ను 'పతనం' కాకుండా నిలబెట్టింది - "నేను వివాహితుడ్ని. నాకూ ఓ అందమయిన అర్థాంగి ఉంది. నాగురించి అహరహము ఆశలు పెంచుకుంటూ ఉంటుంది. కలలు కంటూ ఉంటుంది" అనే విచక్షణే! అదే నాకు ఎన్నో బలహీనక్షణాల్లో భుజంతట్టి 'రక్షక కవచం'గా అడ్డుపడింది.

నాకు మంచి ఉద్యోగమే దొరికింది. బి. య్యే. డిగ్రీలకి బొత్తిగా అన్యాయం జరుగుతున్న యీ రోజుల్లో నా బి. య్యే. డిగ్రీ ఒక 'ఫరమ్'కి అసిస్టెంటు మానేజర్ హోదాకి పనికి రావటం ఒక విధంగా గర్వకారణమే అయింది నాకు.

కాస్త కాలూ, చెయ్యీ కూడదీసుకుని ముకుందరావుగారి వీధిలోనే ఒక మంచి ఇల్లుని అద్దెకి తీసుకుని అర్థాంగిని తెచ్చి కాపురం పెట్టేను. ఆయేడే సుగుణకి మేనత్తకొడుకు శ్రీపతితో, పెళ్ళయింది. అతనికి ఉద్యోగం, సద్యో

గం ఏమీ లేనందున ముకుందరావుగారి ఇంట్లోనే ఉంటూండేవాడు. ముకుంద రావుగారికి నెలసరి అద్దెలమీద మూడు వందల పైచిలుకువస్తాయి బస్తీకాబట్టి. పైగా ఏవో పొలాలుకూడా ఉన్నట్లు వినికిడి. ఫర్వాలేదు. నాలుగువేళ్ళూ నిరాటంకంగా నోట్లోకి వెళతాయి. పరిశుభ్రమైన గుడ్డే ఆచ్ఛాదనగా నిలుస్తుంది!

అల్లుడు శ్రీపతికి నెలకి సిగరెట్లకీ, సినిమాలకీ నలభై రూపాయల సాదరు ఖర్చులిస్తే చాలు, అతని మొహం నిశ్చింతగా, నిండుగా ఉంటుంది. ఒక వాటా వాళ్ళిచ్చే నెలఅద్దె అతనికి కేటాయించేరు ముకుందరావుగారు.

అటు తర్వాత – తమవీధిలో చాలా కాలంగా ఉంటూ, డాబా ప్లానుతో గోడలులేపి పైన స్లాబు వేయించే సామర్థ్యం లేక రెండు నిట్టాళ్ళ తాటాకు కప్పు వేయించి, మూడేళ్ళ కాలంలో ఆ ఇంట సూర్యచంద్రులు జబర్దస్తీగా తొంగిచూస్తున్నా లెక్క చేయని భీదపంతులుగారు ఇల్లు అమ్మేస్తానని ముకుందరావుగారితో తన అప్పుల రామాయణంలో పిడకల వేటగా విన్పించగా, వెంటనే ఆ బేరాన్ని ఫైసలుచేసి ఆ ఇంటికి నన్ను యజమానిని చేసారు.

అయితే – మొదట్లో ఆ కొంపని చూసి, "ఇంత దౌర్భాగ్యపు కొంపలో దెయ్యాలుకూడా ధైర్యంగా కాపురం ఉండలేవే! నే నెలా ఉండగలను?" అని మధనపడినమాట అబద్ధం అంటే ఆత్మద్రోహం, అసత్యదోషం నన్ను పట్టి పీడించక మానవ్.

కానీ – తన ఇంజనీరు ప్రతిభనంతా వెచ్చించి, చక్కటి ప్లానుతో ఇంటి పునర్నిర్మాణం వాస్తుశాస్త్రానికి భిన్నం లేకుండా కొనసాగించి నా కళ్ళముందే దాన్ని చక్కటి నమూనాగా నిలబెట్టి నపుడు మాత్రం– "దీని తస్సాదియ్యా! యిదేదో మహేంద్రజాలంలాగాఉందే!" అని అబ్బురపడ్డాను.

ఆలస్యం లేకుండా గృహప్రవేశం కూడా చేసేశాను, నాన్నగారూ, ముకుందరావుగారూ అభివృద్ధి ఆకాంక్షల అక్షింతలు జల్లి నిండు హృదయంతో ఆశీర్వదించగా!

ఇక సుగుణ గురించీ...!

"మేనత్తకొడుకూ ఒక మొగుడేనా?" అన్నట్లు శ్రీపతి ఆమె కంటికి తన పతిగా, తనమీద సర్వాధికారిగా, తన పరిచర్యల్ని ఠీవిగా స్వీకరించగలవ్యక్తిగా ఏనాడూ కంటి కగుపించలేదు. అంటే ఆమెకి నేత్రదృష్టిలోపం ఉన్నదని కాదు!

పరిస్థితి అలాంది. శ్రీపతి–సిగరెట్లు, సినిమా ఖర్చూ యిచ్చి పోషించే మేన మావఁ కూతురు సుగుణని చాలా జాగ్రత్తగా పలకరించేవాడు. ఛణుకులు

విసిరేవాడు కానీ హద్దులుమించికాదు. అతని కామె ఒక బాస్ కూతురు లాంటిది!

పెళ్ళి అయినా, నాతోటి చనువుని పిసమంతకూడ తగ్గించుకోని సుగుణ ప్రవర్తనకి నా శ్రీమతి కాస్త బుద్ధిమంతురాలు కాబట్టి కినుకబూని, అపార్థాలతో తలమున్కలయి బాధపడి బాధించటం వంటిది అదృష్టవశాత్తూ ఏమీ లేదుగానీ - మగవాడైన శ్రీపతి తన భార్య అలా విచ్చలవిడిగా మరో పరాయి మొగాడితో మొగుడిముందే వికవికలూ, పకపకలూగా ప్రవర్తిస్తుంటే మండే గుండెకి ఏ ఫైర్ స్టేషన్ కి ఫోను చేసి చల్లబరచగలడు?

ఈ ప్రశ్న నన్ను బాధించినంతగా సుగుణని బాధించకపోవటం నేను చేసుకున్న పాపం. లేదా నా దురదృష్టం! నేను శ్రీపతి మొహంలోకి గిట్టీగా చూసేవాణ్ణి కాదు. (అసలు గిట్టీ కాదు కాబట్టి!) కానీ అతని మొహంలో 'మైండ్ ఇండెక్స్' ఏమన్నా అవుపిస్తుందేమో, అసూయ లాంటి ఎలిమెంట్ కి చోటు దొరికిందేమో నని పరిశీలనగా చూసేవాణ్ణి.

మెర్క్యూరీ కోటింగ్ యిచ్చినట్లు ఫ్లోరసెంట్ గా నవ్వే శ్రీపతి మొహంలో నేను వెతికేవి ఒక్కటీ అగుపించేవికాదు. మనసులో మూత వేసి కప్పెట్టాడేమో ననిపించేది. అదే నిజమయితే, ఆ మూత క్రింద బుసలుకొట్టే నాగుపాామే కాపురం ఉండేది!

ఈ కథ ఆరంభంలో నేను పేర్కొన్న మా వీధిలోని ముగ్గురు పెద్దమనుషుల అవసరం మళ్ళీ వచ్చింది! వాళ్ళే నాకు ముకుందరావుగారి గురించి, సుగుణ శీలం గురించీ కొండేలు చెప్పింది.

సుగుణ శీలం గురించి శంకించవలసిన పనిలేదు. ఆమె పరిశుభ్రమయిన అద్దం లాంటిది. వ్రేలితో తాకినా ఆ ముద్ర స్పష్టంగా అగుపిస్తుంది. లేని మచ్చల్ని ఆపాదించినంత మాత్రాన మిరమిరలాడే అద్దానికి మకిలిపట్టిందని మోసపోయే మూర్ఖు డుండడు.

అటువంటి మూర్ఖత్వం ఒకవేళ ఆవహిస్తే అది కేవలం శ్రీపతికే నన్న నా ఊహ ఒక శుభదినాన నిజమయి కూర్చుంది!

ఆ రోజు ఆదివారం. అంటే-నాకు శలవుదినం.

సుగుణ ఉదయాన్నే మా యింటికి వచ్చి ఆ కబుర్లు, యీ కబుర్లు చెబుతూ మధ్యాహ్న భోజనంకూడ ముగించి, కారమ్స్ ఆడుతూ కూర్చుంది.

అంతలో ఆముదం త్రాగిన మొహం పెట్టి శ్రీపతి వచ్చాడు. అతనికి కాఫీ గిట్టదు కాబట్టి హార్లిక్స్ యిప్పించాను. గ్లాసెడూ త్రాగి నీరసంగా కుర్చీలో వెనక్కి వాలేడు!

"కారమ్స్ ఆడతారా?" అనడిగితే



"ప్చ్, రాదండీ" అంటూ చప్పరించాడు. సగ్లెమ్మని అంతవరకూ ఆడుకుంటున్న 'మనీ' ఆటనే కొనసాగించాము.

కాస్సేపు ఓపికకి పరీక్ష పెట్టి ఓడిపోయేడు శ్రీపతి.

"సుగుణా! ఇక వెళ్దాం వస్తావా? ఈవేళ నీతో మాట్నీకి ప్రోగ్రాం వేశాను..." అన్నాడు కూలింగ్ గ్లాస్‌ని ఓ చేత్తో గిరగిర తిప్పుతూ.

అయోమయంగా చూసింది సుగుణ.

"ఇంత అర్ధాంతరంగా చెబితే ఎలా బావా? నేను యీవేళ ఇందిర అక్కయ్యతో, బావగారితో కలిసి ఫస్టు షోకి ప్రోగ్రాం వేసుకున్నాను" అంది అప్రసన్నంగా మొహంపెట్టి.

ఆ బావగారు నేనే నని గ్రహించేక శ్రీపతి మొహంలో నే నింతకాలమూ వెతుకుతున్నవన్నీ గబగబ కన్పించేయి. అతని మొహం తెలుపు, నలుపులమధ్య ఊగిసలాడిందో క్షణం. చివరకి "మొత్తానికి నీకు బావమీదకన్నా, బావగారి మీదే ప్రేమ జాస్తిలాగుందే" అన్నాడు నవ్వాలని ఒక విఫలయత్నంచేసి.

ఆ మాటలలోని గూఢార్థం సుగుణకి

అర్థమై ఉంటే ఎంతయినా బావుండేది. అయివుంటే – ఆమె అమాయిక ఎలా అవుతుంది?

అసలు అనుమానం అంకురించిందా, పెనుభూతంలా అది చిత్తశాంతిని కడు పారా భుజించి కానీ తృప్తిచెందదు. పైగా యీ మధ్య శ్రీపతికీ మా వీధిలోని ముగ్గురు గౌరవనీయులకీ దోస్తీ జాస్తి అయింది!

క్షీరకుంభంలో కాలకూటాన్ని చిందించే తరహా మనుషులు వాళ్ళు. అందాకా దేనికి? సుగుణ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని, ఆమె లోని పవిత్రతని మంటగలుపుదామని యత్నించి విఫలులైన మొనగాళ్లు ముగ్గురూను!

మళ్ళీ వయస్సు లేమీ అల్పంకాదు– ఎటొచ్చీ బుద్ధులు అల్పం కానీ! అటువంటి ప్రబుద్ధులు సుగుణకీ నాకూమధ్యన గల చనువుకి పది అర్థాలు చూపించి ఉన్నారంటే అందులో ఆశ్చర్యం ఇసుమంత కూడా అక్కర్లేదు.

శ్రీపతి యింగితాన్ని అర్థం చేసుకున్న తర్వాతకూడా సుగుణని మందలించకుండాఉండలేకపోయేను. "మేము యీవేళ మా చుట్టాలింటికి వెళ్దామనుకుంటున్నాము. సుగుణా! సినిమాకి వెళ్ళటం వీలుపడదు. నువ్వోళ్ళరాదూ!" అన్నాను అనునయంగా.

"అలా వీల్లేదు. మీరు వెళ్ళనిపక్షంలో నేనూ వెళ్ళదల్చుకోలేదు" అంది ఖండితంగా సుగుణ.

శ్రీపతి చివాలున కుర్చీలోంచిలేచి, నిష్క్రమించేడు. ఉస్సురని నిట్టూర్చి నుదురుతట్టుకున్నాను. అంతా వ్యర్థం!

*　　*　　*

అర్ధరాత్రి అంత అర్ధాంతరంగా, ఆదరాబాదరా తలుపుతడుతున్న వ్యక్తి మీద విపరీతమయిన ఆగ్రహం కలిగింది. వస్తున్నా నని కేకపెట్టినా అవతలి వ్యక్తి ఆగకుండా బాదేయటం చికాకుని పెంచింది.

విసురుగా తలుపు తెరిచి తెల్లబోయేను!

ఎదురుగా–దయ్యాన్ని చూసి ఝడుసుకున్నట్లు వెర్రివాలకంవేసి నిలబడిన శ్రీపతి నోటమాట పెగలనట్లు నిలబడి ఆపాదమస్తకం కంపించిపోతూ కన్పించాడు.

"ఏమిటి శ్రీపతీ! ఏమయింది? ఇంత రాత్రివేళ యిలా వచ్చేవేమిటి?" ఆదుర్దాగా ప్రశ్నించేను. ముకుందరావు గారు జరాభారం మీదపడిన వ్యక్తి. ఆరోగ్యంకూడ అంతంత మాత్రంగానే ఉన్నదీమధ్య!

"కొంప మునిగిందండీ. సుగుణ నేనేదో అన్నాననే అక్కసుతో ఏదో మింగి అఘాయిత్యం చేసుకుంది! నాకు భయం వేస్తోంది. మామయ్య ఊళ్ళో లేడు. మీరు తక్షణం రాకపోతే



ప్రాణం నిలిచేట్లు లేదు. గిల, గిల తన్నుకుంటోంది..." పాఠంలా ఒప్పజెప్పేడు, చెమటతో తడిసి ముద్దయిన మొహాన్ని రుమాలుతో అద్దుకుంటూ.

విషయం వింటున్న నాకూ, ఇందిరకీ కాలూచెయ్యీ ఆడలేదు. నిలువు గ్రుడ్లేసుకు నిలబడ్డ నన్ను మరోమాటు హెచ్చరించేడు శ్రీపతి. "మీరిలా జాప్యంచేస్తే పరిస్థితి చెయ్యిదాటిపోతుంది. నేను త్వరగా వెళ్ళి డాక్టరుని పిలుచుకొస్తాను. ఈ లోగా మీరు సుగుణని కనిపెట్టుకుని ఉండాలి...'' అంటూ వెళ్ళిపోయేడు. ఆదరా, బాదరా ముకుందరావుగారింటికేసి నడిచాం.

*　　　*　　　*

"తెల్లవారితే ప్రమాదం తప్పినట్లే!'' అన్నాడు డాక్టర్, సిరెంజి వగయిరా మెడిసిన్ ఛెస్టులోకి సర్దుతూ. అంటే ఉషోదయం వరకూ సుగుణకీ మృత్యువుకీ భీకర పోరాటం తప్పదన్న మాట. విజేత లెవ్వరో తెలుసుకునేందుకు తెల్లవారాలి!!

శ్రీపతి మతిపోయిన మనిషిలా తల చేత్తో పట్టుకుని కూర్చున్నాడు. "సుగుణ కేమన్నా అయితే ముకుందం

మామయ్యా నన్ను తుపాకీతో కాల్చే స్తాడో...'' అని రాత్రినుండీ ఒకటే గోల.

అతనిలోని బాధకి ప్రాణంమీద తీపి తప్ప, జీవన్మరణాల మధ్య కొట్టు మిట్టాడుతున్న భార్య పరిస్థితి కానం దుకు చాలా అసహ్యాం వేసింది.

సుగుణ వళ్ళెరక్కుండా మత్తుగాపడి ఉంది. శ్వాస బరువుగా ఆడుతోంది, రెప్పలు సగం మూసుకొని, తెల్లగ్రుడ్డు బయటికి కగుపిస్తూ భయం కలిగిస్తోంది.

తడబడుతున్న అడుగులతో నా సమీపాన ఉన్న కుర్చీలో కూలబడి, మొహాన్ని నాసమీపానికి తెస్తూ "తెల్ల వారుతుం దంటారా?" అనడిగేడు శ్రీపతి!

చిరాగ్గా చూసేను. అతని ప్రశ్న నాకు అర్థంకాకపోలేదు. లోకానికి తెల్లవారటంకాదు - సుగుణ శుభోద యాన్ని చూడగలుగుతుందా? అని అతడు అడుగుతూంట!

"తెల్లవారకేమవుతుంది?" అన్నాను కటువుగా, వ్యంగ్యంగా. నిట్టూరుస్తూ నిస్సహాయంగా నాకేసి చూసేడు, శ్రీపతి!

"అసలిలా అవుతుందనుకోలేదండీ" అంటూ హీనస్వరంతో తాను సుగుణ మనసు బాధపడేలా ఏమేమి మాట లన్నదీ, లోకం ఆమె నడత గురించి ఎంత చెడ్డగా అనుకుంటున్నదీ (లోకం అంటే యిక్కడ మా వీధిలోని ముగ్గురు గౌరవనీయులే!) ఎట్లా హెచ్చరికగా చెప్పిందీ - అన్నీ చెప్పాడు. పోతే, పిరికివాడు...నా మీద తనకున్న అను మానాన్ని మాత్రం వెల్లడించే సాహసం తలబెట్టలేకపోయేడ!

ఆఖరున చిర్రెత్తి యిలాఅన్నాను-

"చూడు శ్రీపతీ! నిజాయితీ నిప్పు లాంటిది. నివురుగప్పిన నిప్పులాంటిదే నిజమయిన నిజాయితీ. దానిని శంకించి, చెలగాట మాడనంత వరకూ ఏమీకాదు. రెండోపక్షంలో చేతులు కాలకమానవ్; నువ్వుచేసిన పొరబాటు అదే. ముకుంద రావుగారు ఇంట్లోలేరుగదా అన్న ధైర్యంకొద్దీఅనరానిమాటలని 'సుగుణ' నిజాయితీని శంకించావ్. అద్దంలాంటి ఆమె మనస్సుమీదకి రాళ్ళు సిరావ్, ఫలితం యీఘోరం! సుగుణ కేమన్నా అవుతే ముకుందరావుగారు నిన్ను తుపాకీతో కాలుస్తారని భయపడుతు న్నావ్ తప్పిస్తే-ఆమె నీ అర్ధాంగి... ఆమె లేనినాడు నీ జీవితం చీకటి అవు తుందని నీకు అనిపించటం లేదంటేనే, నీ అంతరంగం ఎంతకుచ్చితమో తెల్సి పోతోంది. ముకుందరావుగారు కాదు- సుగుణకి ఒకవేళఏమన్నా అవుతే నీ పాపానికి వడ్డీ అసలు ఫాయిదాలతో వసూలు చేసేవాడు విడిగా ఉన్నాడు! ఆ దేవుడికి భయపడన్నా సుగుణలోని నిజాయితీని అర్ధంచేసుకో. ఆమె నిర్మల మూర్తి. ఆమెచేత ప్రేమించబడటా నికి యత్నించు..."

శ్రీపతి జ్ఞానోదయం అయినవాడి లాగ, మెరిసే కళ్ళతో కృతజ్ఞతగా, నా చేతులొత్తిమాటు నొక్కి సుగుణ సమీపానికి ఆత్రంగావెళ్ళేడు.